సాక్షి వికారాబాద్

సోమవారం । 2 । డిసెంబర్ । 2024



బ్రిడ్జి పనులకు మోక్షం

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బ్రిడ్జి కల నెరవేరనుండటంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



పాలమూరు అభివృద్ధికి..

పాలమూరు జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



ధర్మాన్ని కాపాడుకోవాలి

ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ భాస్కర యోగి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం



మహాసభల ఆహ్వాన కమిటీ సభ్యులతో యూటీఎఫ్ జిల్లా నాయకులు

పరిగి: విద్య, ఉపాధ్యాయ సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం అన్నారు. ఈ నెల 14న పరిగి పట్టణంలో నిర్వహించే 5వ జిల్లా మహాసభ ఆహ్వాన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సదానందం, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య, సభ్యులుగా వెంకట్, రాములు, కరుణాకర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వెంకటరత్నం మాట్లాడుతూ.. జిల్లా మహాసభలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటయ్య, బాబురావు, జమున, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

ధారూరు: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అర్హులకు ఆరు గ్యారంటీలు అందడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆరోపించారు. పథకాల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా పార్టీ మండల అధ్యక్షుడు ఎం రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటర్‌లో తప్పుగా నమోదు చేయడం వలన తమకు పథకాలు అందడం లేదని ప్రజలే అంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాండుగౌడ్, నందు, రాజునాయక్, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు



మాట్లాడుతున్న వెంకటేశ్

తాండూరు టౌన్: ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని జిల్లా లీగల్ ఎయిడ్ చీఫ్ కౌన్సిల్ వెంకటేశ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకిన వారి పట్ల ప్రజలు సానుకూలంగా ఉండాలన్నారు. హెచ్‌ఐవీ సోకినట్లు అనుమానంగా ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. హెచ్‌ఐవీ సోకిన వారికి ఆస్పత్రి ప్రత్యేక విభాగం ద్వారా మందులు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ టెస్టింగ్, ఏఆర్‌టీ చికిత్సా విధానం గురించి వివరించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. ఇందుకు సహకరించిన సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలకు అభినందనలు తెలిపారు.

కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే

నేటి నుంచి 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు ఎయిడ్స్, లెప్రసీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్ యాదవ్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరిస్తారన్నారు. స్పర్శ లేని మచ్చలు, పాలిపోయిన మచ్చలు ఉన్నట్లయితే పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నవారు భయాన్ని వీడి, వైద్యులను సంప్రదించి తగు చికిత్స తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేయడం వల్ల అంగవైకల్యం కలుగుతుందని, ఇతరులకు సోకుతుందని తెలిపారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.



మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన టమాటా పంట

కూరగాయల ఖిల్లా మల్లేపల్లి



బిందుసేద్యంలో సాగు చేసిన బంతిపూల తోట

గ్రామంలో 90శాతం మంది రైతులు అటువైపే మొగ్గు

- ఆధునిక పద్ధతులతో పంటల సాగు
- మల్చింగ్, పాలిహౌస్, పందిరి విధానంలో సాగు
- లాభాలు గడిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న అన్నదాతలు

పరిగి: వర్షాధార పంటల కంటే కూరగాయల సాగుపైనే మల్లేపల్లి రైతులు మక్కువ చూపుతున్నారు. గ్రామంలో ఒకరిద్దరు కాదు.. 90 శాతం మంది కాయగూర పంటలనే సాగు చేయడం మొదలు పెట్టారు. పంట ఉత్పత్తులను నగరంతోపాటు,



బీర కాయలు కోస్తున్న రైతు కాశప్ప

జిల్లాలోకి పలు వారంతపు సంతల్లో విక్రయిస్తూ లాభాలు పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కూరగాయల సాగులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే మల్లేపల్లికి ప్రత్యేక గుర్తింపు ఉంది. గతంలో కలెక్టర్ నుంచి ప్రసంశలు కూడా పొందారు. పరిగి మండలం మల్లేపల్లి పేరు వింటేనే కూరగాయల గ్రామం అని అంటారు. ఇక్కడి రైతులు వివిధ రకాల కూరగాయ పంటలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. వరి, పత్తి, మొక్కజొన్న వంటి సంప్రదాయ పంటలతో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో కొత్త పంథాలో ముందుకు సాగుతున్నారు. సాగు విధానాన్ని పూర్తి స్థాయిలో మార్చి.. నీటిని ఆదా చేసే మల్చింగ్, పాలిహౌస్, పందిరి సాగు లాంటి ఆధునిక పద్ధతుల్లో కూరగాయలు పండిస్తూ అధిక దిగుబడి పొందుతున్నారు. పలువురు రైతులు తీగజాతి రకాలైన బీర , కాకర, చిక్కుడు అలాగే బెండ, టమాటా, మిర్చి, వంకాయ, గోరుచిక్కుడు లాంటి పంటలను ఏడాది పొడవునా పండిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

తక్కువ నీటితో..

అన్ని కాలాల్లో లాభాలు వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా కూరగాయల సాగును ఎంచుకున్నారు. బిందు సేద్యం ద్వారా మల్చింగ్, పాలిహౌస్, పందిరి సాగు చేస్తూ నీటిని ఆదా చేస్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండిస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంట్లో రైతు ఉన్నాడు. అర ఎకరం నుంచి రెండు ఎకరాల వరకు కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు.

814 ఎకరాల సాగు భూమి

మల్లేపల్లి గ్రామంలో 1,582 మంది జనాభా ఉండగా, 420 మంది వ్యవసాయం చేస్తున్నారు. గ్రామ పరిధిలో 814 ఎకరాల సాగు భూమి ఉండగా సుమారు 300 ఎకరాల్లో 135 మంది రైతులు ఉద్యాన పంటలనే సాగు చేస్తున్నారు. దాదాపు 90శాతం మంది రైతులు బిందు సేద్యం పద్ధతిలో పంటలు పండిస్తున్నారు.

శాశ్వత పందిళ్లు

ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకొని శాశ్వత పందిళ్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటిలో తీగజాతి పంటలైన బీర, కాకర, కీర, సొరకాయ వంటి అంతర పంటలు సాగు చేస్తున్నారు. మరి కొంత మంది రైతులు సొంత డబ్బులతో పందిరి పంటలు సాగు చేస్తున్నారు.

తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభం

నీటి వసతి ఉన్న రైతులు స్వల్పకాలిక ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఏడాదిలో మూడు పంటలు వేసుకోవడానికి వీలుండే వాటిపై దృష్టి పెట్టారు. ఒక పంటకు గిట్టుబాటు ధర రాకున్నా రెండో పంటలో తప్పనిసరిగా లాభం వస్తుందని రైతులు అంటున్నారు. కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తూ తక్కువ కాలంలో ఎక్కువ పంటలు పండించి లాభాలు పొందుతున్నారు. మూడు నెలల వ్యవధిలో పంట చేతికొస్తుండటంతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను పండిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

పందిరి సాగుతో అధిక లాభాలు



పందిరి సాగు చేస్తే చీడపీడల సమస్య చాలా తక్కువగా ఉంటుంది. కాయలు భూమిపైన ఉండకపోవడంతో కుళ్లిపోకుండా ఉంటాయి. పందిరి సాగులో తీగజాతి చెట్లు ఎక్కువ విస్తీర్ణంలో వ్యాపించి అధిక దిగుబడి ఇస్తాయి. పంట మార్పిడితో లాభం చేకూతుంది. కూరగాయలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది.

– కాశప్ప, రైతు, మల్లేపల్లి

ప్రభుత్వం ప్రోత్సహించాలి



గ్రామంలోని చాలా మంది రైతులు ఉద్యాన పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించాలి. గతంలో యంత్ర లక్ష్మి పథకం ద్వారా అనేక పనిముట్లు పొందేవాళ్లం . చాలా కాలంగా ఆ పథకాన్ని ఆపేశారు. ఆ స్కీమ్‌ని తిరిగి ప్రారంభించాలి. ప్రభుత్వం కూరగాయల పంటలను ప్రోత్సహించాలి.

– చెన్నయ్య, రైతు, మల్లేపల్లి

ఉద్యాన పంటలతో లాభాలు

ఉద్యాన పంటలకు మంచి డిమాండ్‌తోపాటు అ ధిక ధరలు వస్తాయి. బిందు సేద్యం, పందిరి సాగు, మల్చింగ్ పద్ధతులు పాటిస్తే అధిక దిగు బడి వస్తుంది. ఎక్కువ శ్రమ పడకుండా, అత్యధిక నీరు అవసరం లేకుండా లాభదాయకమైన పంటలను సాగు చేయవచ్చు. ఉద్యాన శాఖలో సబ్సిడీలు ఉంటే రైతులకు తెలియజేస్తాం.

– వైజయంతి, ఉద్యాన శాఖ అధికారి, పరిగి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: అర్హులైన ప్రతిఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు ఖరీదైన వైద్యం పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్య శ్రీలో అన్ని రకాల వైద్య పరీక్షలను చేర్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంగమేశ్వర్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి సహకారం

బంట్వారం: మార్కెట్ కమిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బంట్వారంలో మేకల సంత ఏర్పాటు, రైతుల కోసం గోదాం నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

కేసీఆర్ కుటుంబమే బాగుపడింది

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- యాలాల మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

యాలాల: ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలో ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అంతకుముందు రాఘవాపూర్, కమాల్‌పూర్, నాగసముందర్, అన్నసాగర్, బాణాపూర్, అడాల్‌పూర్, రాస్నం, బాగాయిపల్లి, అచ్యుతాపూర్, ముద్దాయిపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తుందన్నారు. తాండూరులో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసిందన్నారు. యాలాల మండలంలో రూ.2.75 కోట్ల ఉపాధి నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో రైతు రుణమాఫీ ఒక చరిత్రగా నిలిచిందన్నారు. మండలంలో జుంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దౌలాపూర్ శివారులో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏడాది కల్లా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. వీటితో పాటు తాండూరులో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య కోర్సుల్లో మెళకువలు నేర్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో కేవలం కాగితాల్లోనే పనులు ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధులు కేటాయించిన పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

కాంట్రాక్టర్లతో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కుమ్మక్కు

గత ప్రభుత్వంలో గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కాంగ్రెస్ సర్కారు విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచిన విషయంలో మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ప్రవీణ్‌కుమార్ గురుకులాలను భ్రష్టుపట్టించారని ఆరోపించారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, విద్యార్థుల పొట్ట కొట్టారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, డైరెక్టర్లు మేకల రాజు, నర్సింహులు గౌడ్, మాజీ సర్పంచ్‌లు హన్మంతు, భీమప్ప, మధుసూదన్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అగ్గనూరు వీరేశం, గాజుల మన్నాన్, రఘురాంరెడ్డి, అంజిలయ్య, రాంచందర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాములు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు



అన్నసాగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి?

- ప్రభుత్వాన్ని నిలదీసిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- రైతు పండుగను రైతులే చేసుకోవాలి.. నాయకులు కాదని హితవు

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయడం లేదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం వికారాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాపాలనకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ చేపట్టారు. పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం, కోట్‌పల్లి, ధారూర్ మీదుగా సాయంత్రం వికారాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 నుంచి 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అమలు చేశారని అన్నారు. రైతు పండుగలు రైతులే చేసుకోవాలని రాజకీయ పార్టీలు కాదని హితవు పలికారు. తాము ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఏటా కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర నాయకులు సదానందరెడ్డి, వడ్లనందు, నవీన్‌కుమార్, నరోత్తంరెడ్డి, పాండుగౌడ్ నందు, చరణ్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, రాజు నాయక్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు

ప్రారంభోత్సవంలో కుంగిన ఫ్లోరింగ్

- పంచాయతీ భవనం ఓపెనింగ్‌లో అపశ్రుతి
- భయంతో బయటికి వచ్చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు

యాలాల: పంచాయతీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించిన కొద్ది సేపటికే పెద్ద శబ్దంతో ఫ్లోరింగ్ కుంగిపోయింది. యాలాల మండలం కమాల్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామంలో రూ.20 లక్షలతో పంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదివారం భవనాన్ని ప్రారంభించి.. గదులను పరిశీలించేందుకు లోపలికి వెళ్లారు. అదే సమయంలో ఓ గది ఫ్లోరింగ్ నుంచి భారీ శబ్దాలు రావడంతో.. ఎమ్మెల్యే ఆందోళన చెంది వెంటనే బయటికి వచ్చేశారు. ప్రారంభం రోజే ఇలా జరగడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ పనులు ఎవరూ చేపట్టారని ప్రశ్నించారు. కాగా భవనం నిర్మించిన ప్రదేశంలో గుంతను సరిగ్గా పూడ్చకపోవడంతో కుంగిపోయి ఉండవచ్చని పంచాయతీరాజ్ అధికారులు పేర్కొన్నారు. భవన నిర్మాణం పూర్తయినా తలుపులు, కిటికీలు, విద్యుత్, నీటి సరఫరా పూర్తి కాలేదు. ఇంతలోనే భవనాన్ని హడావుడిగా ప్రారంభించారు.



పంచాయతీ భవనం కుంగడంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మహోన్నత వ్యక్తి పోలీస్ కిష్టయ్య

- అమరవీరుల త్యాగ ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం
- ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటయ్య
- ఘనంగా కిష్టయ్య వర్ధంతి

కొడంగల్ రూరల్: తెలంగాణ మలిదశ పోరాటంలో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోలీస్ కిష్టయ్య ప్రాణాలు అర్పించారని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. ఎందరో అమరవీరుల ఆత్మార్పణలతో ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ప్రభుత్వం ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చుతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్.. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు, అడ్వకేట్ వెంకటయ్య, రాష్ట్ర యువసేన ప్రధాన కార్యదర్శి జగతి అశోక్, యూత్ అధ్యక్షుడు బాల్‌రాజ్, నీటూర్ మాజీ సర్పంచ్ వెంకటయ్య, నాయకులు హన్మంతు, కిష్టయ్య, సాయప్ప, అరుణ, సుమిత్రమ్మ, అమృతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ కిష్టయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

క్లుప్తంగా

ఆర్‌ఎస్‌పీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పరిగి: మంత్రి హోదాలో ఉండి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంత్రులు సీతక్క, కొండ సురేఖ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుచివాఖ్యలు చేసినందుకుగాను ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులు పడుతున్న అవస్థలపై ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నిస్తే ఆయనపై అబాండాలను ఆయనపై మోపడం సరికాదన్నారు. గురుకులాల ఏర్పాటుకు నాంది వేసిందే ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు ఎత్తివేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం ఏడాది కాకున్న రాష్ట్రంలోని విద్యార్థులు కలుషిత ఆహారం తిని 51 మంది మృతి చెందారన్నారు. ఎక్కడ చూసినా కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆనంత్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

యాలాల: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ గిరి తెలిపిన ప్రకారం మండల పరిధిలోని కోకట్ కాగ్నా నది నుంచి శనివారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

చట్టవ్యతిరేక చర్యలపై కఠినంగా వ్యవహరించాలి

పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి



కుల్కచర్ల ఠాణాలో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ శ్రీనివాస్ రెడ్డి

కుల్కచర్ల: చట్టవ్యతిరేక చర్యలపై కఠినంగా వ్యవహరించాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలానికి ముగ్గురు ట్రైనీ ఎస్‌ఐలు వచ్చిన నేపథ్యంలో వారికి పోలీసింగ్ వ్యవస్థను గురించి అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో జరిగే సమస్యలు వాటి పరిష్కారానికి చట్టబద్ధమైన కార్యాచరణ, విధి నిర్వహణలో తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి సరఫరా, ఇసుక అక్రమ రవాణా, రేషన్ బియ్యం సరఫరా, నిషేధిత మత్తుపదార్థాల సరఫరా తదితరాలపై ప్రత్యేక నజర్ పెట్టాలని సూచించారు. సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్ రెడ్డి, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

హస్తినాపురం: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జీఎంఆర్ టెన్నిస్ కోర్టులో నిర్వహించిన టోర్నమెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని ప్రతిరోజు క్రీడలకు పాఠశాలలలో గంట సమయం కేటాయించాలన్నారు.



సాయిపూర్ నంబర్-1 పాఠశాల వద్ద ముగ్గువేస్తున్న మున్సిపల్ సిబ్బంది



సాయంత్రం చెత్త వేసిన వైనం..

ఉదయం ముగ్గేశారు.. సాయంత్రం చెత్త వేశారు

పరిసరాల పరిశుభ్రత కోసం రోడ్లపై చెత్త వేయకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి ఆదివారం ముగ్గులు వేయించారు. కానీ ఇవేమీ పట్టని పట్టణ వాసులు సాయంత్రానికి మళ్లీ చెత్త వేశారు. – తాండూరు టౌన్



చెత్త వేసే చోట ముగ్గు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్

30-70 ఏళ్ల మధ్య వయస్కులకు అథ్లెటిక్స్



పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మంజుల

పోటీలు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతగిరి: వృద్ధాప్యంలోనూ అథ్లెటిక్స్‌లో పాల్గొని యువతకు ఆదర్శంగా నిలవడం అభినందనీయమని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. ఆదివారం నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎస్‌ఏపీ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ కార్యక్రమాన్ని చైర్ పర్సన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్, తాండూర్, పరిగి నియోజకవర్గాల నుండి వచ్చిన 30 ఏళ్ల నుంచి 70 ఏళ్ల లోపు వయసున్న వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రోస్, జంపింగ్, 100, 200, 800, 1500 మీటర్ల పరుగు పందెం, 5కేఎం, 10కేఎం వాకింగ్ లాంటి 22 రకాల ఈవెంట్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. వీరు 2025 జనవరి 4,5 తేదీల్లో గచ్చిబౌలిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు కె.సత్తయ్య గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, వికారాబాద్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, సెక్రెటరీ తస్వర్ అలీ, నాయకులు హఫీజ్, సర్వోత్తమ్ రెడ్డి, నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎం.అశోక్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌కు 9,925 సంచుల ధాన్యం

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 9,925 సంచుల ధాన్యం వచ్చిందని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బీట్ల నిర్వాహణ జరుగలేదని, ఆదివారం నిర్వహించిన బీట్లలో ధాన్యంలో సోనా రకం వడ్లుకు 6,950 సంచులు రాగా క్వింటాల్‌కు తక్కువ రూ.2,300, మధ్యస్తంగా రూ.2,520, అత్యధికంగా రూ.2,665 వరకు ధర పలికిందని ఆమె తెలిపారు. 1010 రకం వడ్లు 2,975 సంచులు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.2,200, రూ.2,240, రూ.2,270 వరకు అమ్మకాలు జరిగాయన్నారు. 449 సంచుల మొక్కజొన్న రాగా క్వింటాల్‌కు రూ.2,400, రూ.2450, రూ.2,500 ధర పలికిందని చెప్పారు.

స్కూటీని ఢీకొట్టిన కారు

ముగ్గురికి గాయాలు

మొయినాబాద్: అతివేగంతో ఎదురుగా వచ్చిన కారు, స్కూటీని ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మొయినాబాద్ గ్రామానికి చెందిన లింగగల్ల శ్రీశైలం, ఆంజనేయులు, శ్రీహరి ముగ్గురు కలిసి శనివారం రాత్రి స్కూటీపై కనకమామిడి గ్రామానికి వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో స్కూటీపై మొయినాబాద్‌కు వస్తుండగా తాజ్ హోటల్ సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంతో వచ్చిన కారు, స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడిపోవడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెండు బైక్‌లు ఢీ..

ఒకరి మృతి

శంకర్‌పల్లి: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్ని ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామానికి చెందిన ఫకీర్‌పాషా(60) వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం ఆయన బైక్‌పై శంకర్‌పల్లి వెళ్తుండగా రావులపల్లి శివారులో శంకర్‌పల్లి నుంచి వికారాబాద్‌వైపు వెళ్తున్న గుర్తి తెలియని ద్విచక్రవాహనదారుడు ఫకీర్‌పాషా బైక్‌ను ఢీకొట్టాడు. ఫకీర్‌పాషాకు తలకు గాయాలవ్వడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

ఇబ్రహీంపట్నం: సెల్ ఫోన్‌తోపాటు నగదును ఎత్తుకెళ్లిన ఇద్దరు దుండగులను ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. నవంబర్ 28న అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన పిల్లి అజయ్(18), అతని స్నేహితుడు ఎట్టి మహేశ్(18)తో కలిసి బైక్‌పై మంగల్‌పల్లికి వచ్చారు. రాఘవేంద్ర హోటల్ వద్దకు రాగానే మహేశ్‌కు ఫోన్ రావడంతో అజయ్ బైక్ ఆపాడు. ఇంతలో ముగ్గురు వ్యక్తులు యాక్టివాపై వచ్చి మొబైల్ ఫోన్‌ను అడిగి తీసుకోగా మరో వ్యక్తి వాహనం దిగి అజయ్‌ను కొట్టి అతని ప్యాంటు జేబులోంచి రూ.3వేల నగదుతో ఉడాయించారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కర్మన్‌ఘాట్‌లో నివసించే నిందితులైన పెర్ల అజయ్‌కుమార్(20), అంకురు ముఖేష్(18)ను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

హై లెవల్ బ్రిడ్జి పనులకు మోక్షం

- బెల్కటూర్ బిడ్జి పనులు షురూ
- స్పీకర్ ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే బీఎంఆర్ చొరవతో నిధుల మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



బెల్కటూర్ వాగు వద్ద ప్రారంభమైన హై లెవల్ బిడ్జి పనులు

తాండూరు రూరల్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచుస్తున్న కల నేరవేరబోతుంది. ఆయా గ్రామాల నిరీక్షణ ఫలించింది. మండల పరిధిలోని కరన్‌కోట్ రోడ్డు మార్గంలో ఉన్న బెల్కటూర్ వాగు వద్ద హైలెవల్ బిడ్జి పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎట్టకేలకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.3.20 కోట్ల నిధులు మంజూరు చేయించారు. వర్షాకాలం వచ్చిందంటే బెల్కటూర్ వాగు పొంగిపొర్లి తాండూరు-కరన్‌కోట్ మార్గంలో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. బెలకటూర్, చిట్టి ఘనాపూర్, చంద్రవంచ, కరన్‌కోట్, ఓగిపూర్‌తో పాటు కర్ణాటకకు వేళ్లే ప్రజలు సైతం ఇబ్బందులకు గురయ్యేవారు. కరన్ కోట్, బెలకటూర్‌లో ఉన్న రెండు సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు కర్ణాటక-తెలంగాణ సరిహద్దులో ఉన్న సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రతి రోజు వందల సంఖ్యలో సిమెంట్ లారీలు, ఓగిపూర్, కరన్‌కోట్ శివారులో నాపరాతి గనుల నుంచి లారీల్లో నాపరాతి బండలు తాండూరుకు తరలివస్తాయి. ఎట్టకేలకు బిడ్జి పనులు ప్రారంభంకావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలోపే ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఐదేళ్లకు ఒకసారి గ్యాస్ పైప్ మార్చాలి



ఫుడ్‌ఫెస్టివల్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న కవిత

- గ్యాస్ లీకైతే 1906 కాల్ చేయండి
- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కవిత

అనంతగిరి: వంట గ్యాస్ లీకైతే 1906 కాల్ చేయలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కవిత తెలిపారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మన వంట గది-మన ఇంటి భద్రత కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఐదేళ్లకు ఒకసారి గ్యాస్ సిలిండర్ పైప్ మార్చాలని సూచించారు. సిలిండర్ కంటే ఎత్తులో గ్యాస్ పొయ్యి ఉంచాలన్నారు. ఫుడ్ ఫెస్టివల్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డీకే వసంత రెడ్డి, తాండూర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిరీష, అనంతగిరి గ్యాస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గోవర్ధన్ రెడ్డి, గ్యాస్ డీలర్లు రాజేష్, సంగమేశ్వర్, అనిల్, విజయవర్ధన్, అజయ్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య

అనంతగిరి: వసతి గృహాలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం బీఆర్‌ఎస్‌వీ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాల్లో పేరుకుపోయిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు సరిపడా బాత్‌రూంలు లేవని, ఉన్న కూడా సక్రమంగా లేవన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు సురేశ్, కృష్ణ, రాజు, వరుణ్, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీ వసతి గృహం వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

పారిశుద్ధ్యంపై కౌన్సిలర్ ఆగ్రహం



కబేళా గేటును సరిచేయిస్తున్న కౌన్సిలర్ సంగీతా ఠాకూర్

తాండూరు టౌన్: తాండూరు పట్టణ మున్సిపాలిటీ ఒక చెత్తకూపంలా మారిందని 20వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ ఆరోపించారు. ఆదివారం ఆమె వార్డులో పర్యటించారు. స్థానికంగా నెలకొన్ని సమస్యలను పరిష్కరించాలంటూ పలుమార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. గాంధీనగర్‌లోని కబేళా గేటు సరిగా లేకపోవడంతో అందులోకి కుక్కలు, పందులు దూరి జంతువుల వ్యర్థ పదార్థాలను జనావాసాల మధ్యకు తీసుకురావడంతో ప్రజలు చాలా ఇబ్బందికి గురవుతున్నారన్నారు. గేటును సరిచేయించి కుక్కలు, పందులు దూరకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు.

సర్వ శాస్త్రాల సమ్మేళనమే భగవద్గీత

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బందెప్పగౌడ్



బహుమతులతో విజేతలు

అనంతగిరి: సర్వ శాస్త్రాల సమ్మేళనమే భగవద్గీత అని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బందెప్పగౌడ్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు భగవద్గీత శ్లోకాలు ఆలపించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత పఠిస్తే ప్రతీ సమస్యకు పరిష్కారమార్గం దొరుకుతుందన్నారు. విద్యార్థులకు చిన్న నాటినుంచే భగవద్గీత, రామాయణాలపై అవగాహన పెంపొందిచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీలతారెడ్డి, వెంకటేశం, ప్రశాంత్, ప్రభాకర్, శ్రీకాంత్, వెంకటేశ్, సతీశ్, ధనిశెట్టి, శ్రీదేవి సంతోష, స్వప్న, నర్సమ్మ, సుజాత, మాధురి, సుమాంజలి, భారతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతకు రిమాండ్



పోలీసుల అదుపులో నిందితుడు అఖిల్‌పాషా

అనంతగిరి: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని వికారాబాద్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాగవీణ తెలిపిన ప్రకారం.. పట్టణంలో గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో శనివారం రాత్రి రైల్వే ఆస్పత్రి సమీపంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో హైదరాబాద్‌లోని లింగంపల్లికి చెందిన ఎండీ అఖిల్ పాషా వద్ద 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు శ్రీనివాస్, ప్రేంకుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్, హన్మంతు, శివప్రసాద్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తుందని.. విద్య, వైద్యానికి రేవంత్ సర్కార్ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నం జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల) విద్యారంగంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మౌలిక వసతులతోపాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేస్తానన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని డీఈఓను ఆదేశించారు. బాలికల పాఠశాలల్లోని సమస్యలపై నివేదిక ఇస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. హాస్టల్స్‌లో, పాఠశాలల్లో ప్రత్యేకంగా ఒక రిజిస్టర్‌ను ఏర్పాటు చేయిస్తానని.. అందులో సమస్యలను, ఇబ్బందులను నిర్భయంగా రాయాలని విద్యార్థులకు సూచించారు. హాస్టల్స్‌లో అవకతకవకలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఆర్డీఓ అనంతరెడ్డిని కోరారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా వ్యాసరచన పోటీల విజేతకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సుశీంధర్‌రావు, ఆర్డీఓ అనంతరెడ్డి రతదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం



లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు(ఫైల్)

చేవెళ్ల: ఎదురెదురుగా వస్తున్న లారీ, కారు ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన మేకల లక్ష్మారెడ్డి(62), భాగ్యలక్ష్మి(48) దంపతులు. లక్ష్మారెడ్డి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్‌లో ఉద్యోగి. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు మనోహర్‌రెడ్డి లండన్‌లో ఉద్యో గం చేస్తుండగా.. చిన్న కుమారుడు రాజశేఖర్‌రెడ్డికి ఇటీవలే ఎయిర్‌ఇండియాలో ఉద్యోగం వచ్చింది. ఆయన సోమవారం ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఆదివారం లక్ష్మారెడ్డి భార్యతో కలిసి మండల పరిధిలోని దేవరంపల్లిలో ఉండే తోటి అల్లుడు దగ్గరకి తమ కారులో బయలుదేరారు. హైదరాబాద్-బీజాపూర్ రహదారిలో వెళ్తుండగా మిర్జాగూడ స్టేజీ సమీపంలో లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు వేగంగా ఉండడంతో లారీని ఢీకొని అదే వేగంతో పక్కనే ఉన్న మర్రిచెట్టుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాగ్యలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా.. లక్ష్మారెడ్డిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదంతో రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

ధారూరు మండలం కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ప్రాజెక్టు సమీపంలోని అడవిలో సంచరించి అక్కడే వనభోజనాలు చేశారు. తర్వాత అలుగుపైకి వచ్చి నీటిలో సరదాగా ఆడుకున్నారు. సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఎంజాయ్ చేశారు. యువతి, యువకులు ఉత్సాహంగా బోటింగ్ చేశారు. – ధారూరు



ప్రాజెక్టు అలుగు వద్ద..